## నేటి ప్రజావాణి రద్దు

మహబూబాబాద్ రూరల్, జనవరి 19 : కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న నాలుగు సంక్షేమ పథకాలపై అధికారులు ఇంటింటి సర్వేలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో ప్రజావాణి రద్దు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

## రెండు బైక్‌లు ఢీ.. ముగ్గురికి తీవ్రగాయాలు

కురవి, జనవరి 19: రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని అయ్యగారిపల్లిలో 365 జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సీరోలు మండలం కాంపల్లి శివారు బిల్యానాయక్ తండా జీపీ పరిధిలోని బోడతండాకు చెందిన సుమతి, శ్రీను బైక్‌పై మహబూబాబాద్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో చిన్నగూడూరు మండలం మంగోరిగూడెంకు చెందిన వినయ్ బైక్‌పై మహబూబాబాద్‌కు వస్తున్నాడు. అయ్యగారిపల్లి గ్రామం వద్ద ఢీకొనగా ముగ్గురు కింద పడి తీవ్రగాయాల పాలయ్యారు. 108లో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## తొర్రూరు సీఐగా గణేశ్



బాధ్యతలు స్వీకరించిన సీఐ గణేశ్

తొర్రూరు, జనవరి 19: తొర్రూర్ సీఐగా తౌటం గణేశ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వర్తించిన జగదీష్ ఇటీవల ఏసీబీకి పట్టుబడగా నూతనంగా గణేశ్ బాధ్యతలు స్వీకరించారు.

## విద్యుత్ షాక్‌తో విద్యార్థి మృతి



అనిల్ (ఫైల్)

దంతాలపల్లి, జనవరి 19: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో ఓ విద్యార్థి మృతిచెందిన ఘటన మండలంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దంతాలపల్లి శివారు గోప్యాతండకు చెందిన బానోత్ బాలు – సరోజ దంపతుల కుమారుడు బానోత్ అనిల్(18) దంతాలపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం ఇంటివద్ద స్నానం చేసేందుకు ప్యాంటు విప్పి రేకులపై వేశాడు. ఇంట్లో ఫ్యాన్‌కు విద్యుత్ సరఫరా కోసం ఉన్న తీగ రేకులకు తాకుతుండగా షాక్ కొట్టింది. దీంతో కింద పడిపోగా గమనించిన కుటుంబ సభ్యులు 108లో తొర్రూర్‌కు తరలిస్తుండగా మృతిచెందాడు.

## వాటర్‌ట్యాంక్ ఎక్కి నిరసన



నిరసన తెలుపుతున్న దామ

మరిపెడ, జనవరి 19: తన భూమి సమస్య పరిష్కరించాలని స్థానికుడైన దామ ఆదివారం వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. తన భూమి సమస్యను పరిష్కరించాలని కొన్నేళ్లుగా అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం తెలిపాడు. పరిష్కరించక పోతే ఆత్మహత్యే శరణ్యం చెప్పాడు. స్థానికులు అతడికి సర్ది చెప్పి కిందికి దింపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★60 రకాల వెజ్ & నాన్‌వెజ్ పచ్చళ్ళు కిరాణా షాపులకు, క్రీపాయింట్లకు, బేకరీషాపులకు, హోటల్స్‌లకు సప్లై చేయడానికి బైక్ కలిగిన యువకులు మండలానికి ఒకరు కావలెను. సెల్ : 8143909459
KMM

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

# కబ్జా కోరల్లో గార్ల పెద్ద చెరువు

- శిఖం భూమికి పట్టాలు చేసిన రెవెన్యూ అధికారులు
- ఆక్రమించిన అధికార పార్టీ నాయకులు
- సర్వే చేసి చెరువు హద్దులు ఏర్పాటు చేయాలని పలువురి డిమాండ్



గార్ల పెద్ద చెరువు (ఫైల్)

గార్ల, జనవరి 19: మండల కేంద్రంలోని పెద్ద చెరువు కబ్జా కోరల్లో చిక్కుకుంది. ఈ చెరువు సర్వే నంబర్ 76లో 396 ఎకరాలు 11 గుంటల్లో విస్తరించి ఉండగా, అందులో సుమారు 150 ఎకరాలకుపైగా చెరువు చుట్టు పక్కల కబ్జాకు గురైంది. చెరువు కింద సుమారు 1800 ఎకరాల్లో వరి పంటను రైతులు సాగుచేస్తున్నారు. రెవెన్యూ అధికారులు కాసులకు కక్కుర్తిపడి అధికార పార్టీకి చెందిన కొందరికి చెరువు శిఖం భూమిని పట్టాలు చేశారు. పెద్ద చెరువు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో చెరువులు, కుంటలను మిషన్ కాకతీయ పథకం ద్వారా అభివృద్ధి చేశారు. కాకతీయుల కాలంలో నిర్మించిన ఈ చెరువును కబ్జాదారులు ఏడాది కాలంగా ఆక్రమిస్తున్నారు. కాకతీయ వంశస్తురాలైన రాణీ రుద్రమదేవి ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు వారి బంధువు గారెమ్మ పేరుతో ఈ చెరువు నిర్మించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ చెరువు వందేళ్లలో వేసవిలో పూర్తిగా ఎండిపోలేదు. శిఖం భూమి సర్వే చేసి, హద్దులు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. అలాగే చెరువు శిఖం కబ్జా చేసి పట్టా చేయించుకున్న రైతులు, పట్టాలు చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

### స్వాధీనం చేసుకోవాలి



గార్ల పెద్ద చెరువు శిఖం భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. రెవెన్యూ అధికారులు కాసులకు కక్కుర్తి పడి దొంగ సర్వే నంబర్లు వేసి కబ్జాదారులకు పట్టా చేశారు. కలెక్టర్ చొరవ చూపి సర్వే నిర్వహించి, హద్దుల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేయాలి.

– కందునూరి శ్రీనివాస్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు

# ఉపాధ్యాయుడు సామాజిక ఇంజినీర్

**టీపీటీఎఫ్ నాయకుడు మైస శ్రీనివాస్**



సమావేశంలో మాట్లాడుతున్న టీపీటీఎఫ్ నాయకుడు మైస శ్రీనివాస్

మహబూబాబాద్ రూరల్, జనవరి 19 : ఉపాధ్యాయుడు సామాజిక ఇంజినీర్‌గా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతాడని టీపీటీఎఫ్ నాయకుడు మైస శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణంలోని డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో నూతన ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో విద్యారంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటుందని, ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగు పెట్టిన టీచర్లు సమస్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కొత్త టీచరర్లు అంకితభావంతో పనిచేయాలన్నారు. సదస్సులో విష్ణువర్ధన్, శ్రీశైలం, శ్రీనివాస్, జనార్ధన్, బాబురావు, బాలాజీ, యాదగిరి, రమేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# కనిపించే దేవుడు.. వైద్యుడు

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- గంగారంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం



మాట్లాడుతున్న మంత్రి సీతక్క, చిత్రంలో ఎస్పీ కేకన్

గంగారం, జనవరి 19: కనిపించే దేవుడు వైద్యుడు అని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల ప్రకారం సీఐ బాబురావు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా మంత్రి హాజరై ప్రారంభించి మాట్లాడారు. ఉమ్మడి మండలాలైన కొత్తగూడ, గంగారం ప్రజలకు ఉచితంగా వైద్యం అందించేందుకు జిల్లా పోలీస్‌శాఖ వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జిల్లా వైద్యులు నెహ్రూ నాయక్, రూప్‌లాల్, డీఎస్పీ తిరుపతి, సీఐ బాబురావు, ఎస్సై రవికుమార్, కుషకుమార్, మాజీ ఎంపీపీ సరోజన, మాజీ జెడ్పీటీసీ రమ పాల్గొన్నారు.

# ఏజెన్సీ గౌడల సమస్యల పరిష్కారానికి కృషి

**ఎమ్మెల్యే కోరం కనకయ్య**



గౌడ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

బయ్యారం, జనవరి 19: ఏజెన్సీ ప్రాంత గౌడ కులస్తుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల గౌడ కులస్తుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని గౌడ భవన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత గౌడ కులస్తులు రాజ్యాంగ హక్కులు దక్కకుండా వివక్షకు గురవుతున్నారని తెలిపారు. మైదాన ప్రాంత గౌడ కులస్తుల్లాగే అన్ని పథకాల అమలుకు కృషి చేస్తానని చెప్పారు. ఏజెన్సీ గీత కార్మికులకు గతంలో సొసైటీలు ఉండగా రద్దు చేశారని, అన్ని బీసీ కులాలకు సొసైటీలు ఉండగా, గౌడ కులస్తులకు లేకపోవడం సరికాదన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏజెన్సీ ప్రాంత గౌడ కులస్తుల పరిరక్షణ కమిటీ గౌరవ అధ్యక్షుడు గుండ్ల నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత గౌడ కులస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర నాయకులు నారాటి వెంకన్న, కొత్త వేంకటేశ్వర్లు, ఉమ్మగాని సత్యం, మండల రాజన్న, బసవ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



కొమ్ములవంచలో మామిడి తోటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి మరియన్న

నర్సింహులపేట, జనవరి 19: మామిడి రైతులు సస్యరక్షణ చర్యలతో పాటు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖాధికారి జినుగు మరియన్న అన్నారు. ఆదివారం మండలంలోని కొమ్ములవంచలో మామిడితోటలను మండల వ్యవసాయ అధికారి వినయ్ కుమార్‌తో కలిసి సందర్శించారు. తేనె మంచు పురుగు నివారణకు లీటర్ నీటికి రెండు గ్రాముల ఎసిఫేట్, ఆకు మచ్చ నివారణకు 2గ్రాముల సాఫ్ కలిపి చెట్టు మొదలు కూడా తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. మామిడికాయల నాణ్యత కోసం పిందె దశలో, నిమ్మకాయ దశలో ఫ్రూట్ బ్యాగింగ్ చేయాలని, దీనివల్ల కాయలు ఆకర్షణీయంగా, మంచి రంగుతో ఉండి మార్కెట్లో ధర వస్తుందని చెప్పారు. మామిడికాయలు పక్వ దశలో కోసి కార్బైడ్ రహితంగా మాగించి మార్కెటింగ్ చేసుకుంటే నేరుగా రైతులకు ఆదాయం వస్తుందని తెలిపారు. వర్షాకాలం ఆరంభ సమయంలో కొమ్మ కత్తిరించి, పచ్చిరొట్ట వేసి కలియదున్నాలని చెప్పారు. నూతన రకాల సాగుతోపాటు మల్చింగ్, బిందుసేద్యం, ఫర్టిగేషన్, అధిక సాంద్రతల మొక్కలు నాటడం వంటి పద్ధతులు పాటించాలన్నారు.

# 36 ఏళ్ల తర్వాత కలిశారు

**చిన్నగూడూరులో అ'పూర్వ' సమ్మేళనం**



పదో తరగతి 1987–88 బ్యాచ్ విద్యార్థులు

చిన్నగూడూరు, జనవరి 19: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1987–88 పదోతరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 36ఏళ్ల తర్వాత కలుసుకోగా ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకొని, తరగతి గదులు తిరిగి చూశారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గురువులు యాదగిరి, సారంగపాణి, చంద్రమౌళిని ఘనంగా సన్మానించారు. పుట్టిన ఊరు, విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలను ఎన్నడూ మరవొద్దని, తమ వంతు సహాయ సహకారాలు అందించాలని గురువులు చెప్పారు. పూర్వ విద్యార్థులు డీఎస్ వెంకన్న, గాడిపల్లి శ్రీహరి, నెహ్రూ, జంపాల చక్రధర్, జెట్టి వెంకన్న, డీ వెంకన్న, శ్రీలత, రమేశ్, వీరనారాయణ, శ్రీదేవి, కృష్ణవేణి, నాగరాణి, వరలక్ష్మి, యాదగిరి, కాంతారావ్, కిష్టు, మంగీలాల్ ఉన్నారు.

## గ్రామ సభలకు ఏర్పాట్లు చేయాలి

మహబూబాబాద్ రూరల్, జనవరి 19 : ఈనెల 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామసభలకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. ఆదివారం కలెక్టర్ ప్రధాన సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారులైన ఎంపీడీవోలతో సమావేశాన్ని నిర్వహించారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల ఎంపికకు గ్రామసభలు నిర్వహించాలని అన్నారు. ఈ సభలకు హాజరైనవారికి కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ రేషన్‌కార్డులు జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవోలు గణేశ్, కృష్ణవేణి, జిల్లా అధికారులు, ఎమ్మార్వోలు పాల్గొన్నారు.

## క్షతగాత్రులకు ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ సాయం



తాగునీరు అందించి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్

మరిపెడ, జనవరి 19: రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ సాయం చేశారు. హైదరాబాద్ టు సూర్యాపేట హైవేపై చౌటుప్పల్ వద్ద ఆదివారం ద్విచక్ర వాహనం నుంచి కింద పడి ఇద్దరు గాయపడ్డారు. ఈ మార్గంలో కారులో వెళ్తున్న ఎమ్మెల్సీ వీరిని గమనించి ఆగారు. ప్రమాదం గురించి అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులను ప్రత్యేక వాహనంలో చౌటుప్పల్‌లో ప్రైవేట్ హాస్పిటల్‌కు పంపి, వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

## రుణమాఫీ పూర్తిగా అమలు చేయాలి

కేసముద్రం, జనవరి 19: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీని పూర్తిగా అమలు చేయాలని ఏఐసీటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రిపల్లి మొగిళి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుభరోసా పథకం కింద డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పంటలకు మద్దతు ధర అందించేలా చట్టం చేయాలని ఏఐసీటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రిపల్లి మొగిళి అన్నారు. జాటోత్ బిచ్చానాయక్, నిమ్మల హరికృష్ణ, రామచంద్రు, కుమారస్వామి, రమేశ్, లింభా, రాజేశ్వర్‌రావు ఉన్నారు.

## రేపు జిల్లా స్థాయి ఇంగ్లిష్ ఒలింపియాడ్ టాలెంట్ టెస్ట్

మహబూబాబాద్ రూరల్/ మరిపెడ, జనవరి 19 : ఈనెల 21న పట్టణంలోని ఏకశిలా ఏంజెల్స్ హైస్కూల్‌లో జిల్లా స్థాయి ఇంగ్లిష్ ఒలింపియాడ్ టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు జిల్లా విద్యా శాఖ అధికారి రవీందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 8, 9 తరగతులు చదువుతున్న విద్యార్థినీ విద్యార్థుల్లో ఆంగ్ల నైపుణ్యం మెరుగు పరిచేందుకు వక్తృత్వ పోటీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భాష సాహిత్యం, సమర్థమైన కమ్యూనికేషన్‌పై లోతైన అవగాహనకు ఈ ప్రతిభ పరీక్ష ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. జిల్లా స్థాయి ఇంగ్లిష్ టాలెంట్ టెస్ట్‌ను విజయవంతం చేయాలని జిల్లా ఎల్టా ప్రధాన కార్యదర్శి బయగాని రామ్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులను జిల్లా స్థాయిలో జరిగే పోటీ పరీక్షలకు ఇంగ్లిష్ ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు.



ఆటోడ్రైవర్లతో రోడ్డు భద్రత పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై ఉపేందర్

## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

తొర్రూరు, జనవరి 19: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్సై జి.ఉపేందర్ సూచించారు. ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించడంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛంద సంస్థలు రోడ్డు భద్రతపై చిన్న ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు నవీన్, వెంకన్న, ప్రతాప్, వెంకటేశ్వర్లు, సరేష్, రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలి



రావుల మురళిని సన్మానిస్తున్న మున్నూర్ కాపు కులస్తులు

కేసముద్రం, జనవరి 19: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి చందా గోపి అన్నారు. మండల కేంద్రంలోని ఎంకే కన్వెన్షన్ హాల్‌లో జరిగిన 22 మండలాల మున్నూరుకాపుల వార్షిక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మున్నూరుకాపులకు జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్ కల్పించాలన్నారు. బీసీలు ఐక్యంగా ఉంటూ హక్కులు సాధించుకోవాలని చెప్పారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బోర్డు సభ్యుడిగా నియమితులైన రావుల మురళి, బీజేపీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన ఉప్పునూతల రమేశ్‌ను ఘనంగా సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నీలం శ్రీనివాస్, న్యాయవాది తుంపిళ్ల శ్రీనివాస్, మున్నూరుకాపు కులస్తులు గనె యాదగిరి, శింగంశెట్టి ఏకాంతం, కమటం శ్రీనివాస్, ఆకుల సుధాకర్, దామరకొండ ప్రవీణ్‌కుమార్, పాల శ్రీనివాస్ ఉన్నారు.

# ముగిసిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు



విజేతలకు బహుమతులకు అందిస్తున్న నాయకులు

దంతాలపల్లి, జనవరి 19: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పది రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. మండలంలోని రేపోణిలో గ్రామ యూత్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఖమ్మం జట్టుకు మొదటి బహుమతి కింద రూ.15,116, రెండో బహుమతిగా రేపోణి జట్టుకు రూ.10,116, మూడో బహుమతిగా నెక్కొండ మండలం బడితండా జట్టుకు రూ.5,116 గెలిచారు. ఆయా జట్లకు మాజీ సర్పంచ్ నాగిరెడ్డి శైలజా వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో నగదు బహుమతితోపాటు షీల్డులు అందజేశారు. దాతలు సంపెట సురేష్, శంకర్, మోహన్, గురుమూర్తి, జయరాజు, స్వామి పాల్గొన్నారు.

## కనీస వేతనాలు ఇవ్వాలి

మహబూబాబాద్ రూరల్, జనవరి 19 : మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర రెండో మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ నాయకులు కార్మికులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారికి వేతనాలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి సన్మానాలు, సలాంలు కాకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ, ప్రతి నెలా జీతాలు చెల్లించేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. కిరణ్, యాకూబ్, కొత్తపల్లి రవి, సూర్యం, గురువయ్య, వెంకన్న పాల్గొన్నారు.

## జాతీయస్థాయి తెలుగు నాటకోత్సవాలు

తొర్రూరు, జనవరి 19: జాతీయస్థాయి తెలుగు నాటకోత్సవాలు నిర్వహించనున్నట్లు చైతన్య కళా సమాఖ్య అధ్యక్షుడు మన్నూరు ఉమా అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ తొర్రూరు డివిజన్ పరిధిలోని చైతన్య కళా సమాఖ్య స్థాపించి 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏటా నిర్వహిస్తున్నట్లుగానే ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలోని ప్రముఖ రంగస్థలం నాటక సమాజాలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 13వ జాతీయస్థాయి తెలుగు ఆహ్వానిత నాటిక పోటీలు తొర్రూరు మున్సిపాలిటీ కేంద్రంలో మార్చి 10 నుంచి 14 వరకు ఐదు రోజులపాటు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కళా సమాఖ్య కార్యదర్శి సుంకరనేని పినాకపాణి, సంస్థ వర్కింగ్ ప్రెసిడెంట్, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జినగ సురేందర్‌రెడ్డి, సంస్థ అసోసియేట్ ప్రెసిడెంట్ మాజీ జడ్పీటీసీ మంగళపెల్లి శ్రీనివాస్, లేగల వెంకటరెడ్డి, ఇమ్మడి రాంబాబు, జలగం వెంకన్న, కృపాల్, మాచర్ల(మయూరి) వెంకన్న పాల్గొన్నారు.

## లారీ, కారు ఢీ.. ఒకరికి గాయాలు

కురవి, జనవరి 19: లారీ, కారు ఎదురెదురుగా ఢీకొనగా ఒకరికి గాయాలైన ఘటన మండల కేంద్రం శివారులో 365ఏ జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. ఏఎస్సై సదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యపేటకు చెందిన లారీ సిమెంట్ లోడ్‌ను డ్రైవర్ ధరావత్ రవి మహబూబాబాద్‌లో అన్‌లోడ్ చేసి, కురవి మీదుగా కాంపల్లికి వెళ్తున్నాడు. నాందేడ్‌కు చెందిన అజిత్‌సింగ్ మండలంలోని నల్లెల్ల సూర్యతండాలో బంధువుల ఇంటికి వచ్చాడు. కారులో మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌కు వెళ్తుండగా లారీ, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. కారు ఎగిరి రోడ్డు పక్కనున్న గుంతలో పడింది. అందులో ప్రయాణిస్తున్న గుగులోత్ జతిన్‌కు స్వల్పగాయాలయ్యాయి. లారీ స్టీరింగ్ పగిలి ఆయిల్ లీకైంది. ఘటనా స్థలానికి ఏఎస్సై చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఇంట్లో కాలిపోయిన వస్తువులు పరిశీలిస్తున్న ఎస్సై సురేశ్

## షార్ట్ సర్క్యూట్‌తో వస్తువులు దగ్ధం

నర్సింహులపేట, జనవరి 19: ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి గృహోపకర వస్తువులు దగ్ధమైన ఘటన ఆదివారం మండలంలోని ముంగిమడుగులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దప్పుకాటి వాసుదేవ కుటుంబం హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. గ్రామంలోని వారి ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై సురేశ్ ఇంటి తాళాన్ని పగులగొట్టి మంటలు ఆర్పేరు. ఇంట్లో సామగ్రి, గ్యాస్ సిలిండర్‌ను బయటకు తీశారు. ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు.



బెల్లాన్ని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

## నల్లబెల్లం పట్టివేత.. ఇద్దరి అరెస్ట్

కేసముద్రం, జనవరి 19: మండలంలోని బ్రహ్మంగారి తండా శివారులో ఎక్సైజ్ పోలీసులు నల్లబెల్లం, పటిక పట్టుకొని, ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ సీఐ భిక్షపతి తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన లకావత్ లలిత, సాయమ్మ మహారాష్ట్ర నుంచి సింగరేణి రైలులో 160 కేజీల బెల్లం, 20 కేజీల పటిక తీసుకువచ్చి కేసముద్రం రైల్వేస్టేషన్ సమీపంలో నిల్వ చేశారు. స్కూటీపై రైల్వేస్టేషన్ నుంచి బ్రహ్మంగారి తండాకు తరలిస్తుండగా పట్టుకున్నారు. స్కూటీని సీజ్ చేశారు. వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రామయ్య

## మద్దతు ధర చట్టం చేయాలి

మహబూబాబాద్ రూరల్, జనవరి 19 : పంటలకు మద్దతు ధరలు చెల్లించాలని చట్టం చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని భారత రైతు కూలీ సంఘం జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్‌వీఎం ఫంక్షన్ హాల్‌లో అఖిల భారత రైతు కూలీ సంఘం విలీన సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించి రైతు వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తోందన్నారు. దేశ వ్యాప్తంగా రైతాంగం సంక్షోభంలో చిక్కుకుందని, పెట్టిన పెట్టుబడులు కూడా రావడంలేదన్నారు. ప్రభుత్వం పండిన పంటలకు మద్దతు ధరలు చెల్లించడంలేదన్నారు. వెంటనే మద్దతు ధరల చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. గౌని ఐలయ్య, సత్యనారాయణ, డేవిడ్‌కుమార్, వెంకటేశ్వర్లు, మండల వెంకన్న, లింగన్న పాల్గొన్నారు.



దైద వెంకన్నను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి

## దైద వెంకన్నకు ఘన సన్మానం

మహబూబాబాద్ రూరల్, జనవరి 19 : హరిత మిత్ర అవార్డు గ్రహీత, ప్రజా హృదయ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు దైద వెంకన్నను ఆదివారం పట్టణంలో ఇందిరానగర్ కాలనీలో మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకన్న ఏళ్లుగా అనేక మొక్కలు సంరక్షించారని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, మాదరబోయిన యాకన్న రాము పాల్గొన్నారు.